అభాగ్యులు

మాతృక : 'ప్రసాద్'

అనుసరణ : "హృదయిని"

'ఏయ్! ఎవర్నివు?'
'... ... ...'
'మాట్లాడవేం?'
'... ... ...'

'సరే ఉండు. కేక వేసేవా ఎవరినైనా' అని యామె తన చిన్న నోరును తెఱచినంతనే ఆ యువకుఁడొక చేతితో నామె నోటినిమూసి, రెండవచేతితో నామెను తన విశాల వక్షమున కదిమి పట్టుకొనెను. ఆమె వివశురాలై యూరకుండిపోయెను. నేఁడామె తొలిసారిగా యౌవనభరోద్వేలితాలింగనము పొందెను. జాబిలికిరణములును గాలి విసరుతో పాటు కిసలయముల నెట్టుకొని ఆ జంటపై ప్రసరించెను. ఇంతలో ఆ లతాకుంజమునుండి నెట్టుకొనివచ్చుచున్న వెన్నెలలో రత్నఖచిత ఖడ్గము తళతళ మెఱసెను. భయభీత హరిణశాబకమువలె నామె నల్లని కన్నులు దయమాలిన యా స్థితిలో దయాభిక్షను — ప్రాణభిక్ష నర్థించెను. యువకుఁడు ఆమె నోటిపైని చేతిని తీసివేసెను. అతఁడు తన వదనముపై ప్రేలుంచి నిశ్శబ్దముగానుండ సైగజేసెను. ఆబిడపేరు నూరీ. కాశ్మీరదేశపు కలువకన్నె. సిక్రీమహలులో నామె కోమల చరణముల నృత్యకళా కౌశలము ప్రసిద్ధి వహించెను. ఆ కన్నెపొంగ్గు మకరంద విలాసము మర్యాద భరితము. ఆమె ఆ యువకుని తనకై సాహసించిన ప్రేమికునిగా - మహాబలి అక్బరుదాగుడు మూతలాట సమయమున మిణుగురు పురుగువలె ప్రాణములు పోగొట్టుకొనవచ్చిన ప్రేమికునిగా — తలంచెను. ఈ కాల్పనిక సౌఖ్యములో తనను ధన్యురాలినిగా భావించి నిశ్శబ్దముగానుండి యువకుని మధురాధరములపై తన అరుణాధరముల నుంచెను. యువకుఁడుగూడ తన్ను దానుఱచిపోయి యా సౌఖ్యములో నొక క్షణము గడపెను. నూరీ మెల్లగా — 'ఇక్కడ నుండి త్వరగా వెళ్ళిపో. రేపు వంతెన దగ్గర తొలిజాముగంట మ్రోగునపుడు పొగడచెట్టుక్రింద కల్సికొందును' అనెను.

యువకుఁ డటనుండి మెల్లగా తప్పుకొనెను. నూరీ తడబడు కాళ్ళతో నింకొక పొదవైపు నడచెను - ఆసవ మెక్కువ పుచ్చుకొన్నట్లు. ఆమెను బోలిన సుందరీమణు లెందఱో అక్బరు నన్వేషించుచుండిరి. నీలగగనమందలి చందమామ యీ యాటను జూచి నవ్వుచున్నట్లుండెను. నూరీ కిపుడు మరే పొదలో జొరబడుటకు సాహసము చాలకపోయెను. నర్గీసు ఒక కుంజమునుండి వెల్వడి నూరీని 'ఏమిటి? అటు చూచుచు వచ్చుచున్నావు' అని అడిగెను.

'ఊహుఁ, నాకేమి దొరకలేదు.'
'అయితే, ఇటు కామినీకుంజములలో చూతుమా?'
'నీవే వెళ్ళు. నేనలసిపోయినాను.'

నర్గీసు వెళ్ళిపోయెను. వంగిన మాలతికొమ్మ చీకటి నీడలో కొట్టుకొనుచున్న గుండెలపై చేతి నుంచికొని నూరీ నిలువబడెను! వెనుకనుండి యెవరో యామె కన్నుల మూసిరి. నూరీ గుండె మఱింత కొట్టుకొనసాగెను ఆమె తెచ్చుకొన్న ధైర్యముతో-

'నేను గుర్తించితిని!'
'... ... ...'

'జహార్ పనాహ్' అని యామె నోటినుండి వెల్వడెనో లేదో అక్బరు ఆపె ముఖమునుమూసి మెల్లగా చెవిలో నిట్లనెను—

'మరియమ్మకు చెప్పు - మహారాజ్ఞితో కాదు. తెలిసినదా? నేనా పొదలో నుందును.'

అక్బరు వెళ్ళినంతనే మహారాజ్ఞి యటకు వచ్చెను. నూరీ యామె యంతఃపురములోనిదే, కాని అక్బరు

ఆజ్ఞ! ఆమె రాణికి 'అటు' అని చూపించి తప్పుకొనెను. మరియమ్మ మెల్ల మెల్లగా నటుకువచ్చెను. ఆ క్రైస్తవబేగము ఈ భోగవిలాసపుటనుభవము లేనిది. అయినను ఆమెకీమనోరంజనము నచ్చెను. నూరీ యాబిదకు అక్బరున్న పొదను జూపించెను.

కొన్ని గంటలపాటు లతాంగులందఱు అలసిపోయిరి; అపుడక్బరు మరియమ్మచేతిని బట్టుకొని బయటకు వచ్చెను. నౌబత్ఖానానుండి మధుర రాగము విన వచ్చుచుండెను. అక్బరొకసారి నూరీని పరికించి చూచెను ఆమె నునుబుగ్గపై మెల్లనకొట్టి బహుమాన మిచ్చెను. దాగుడుమూతలాట అయిపోయెను.

2

సిక్రీస్వరమ్ము కంపించుచున్నట్లే నూరీ హృదయము ఆందోళితముగుచుండెను. ఆవసంత జ్యోత్స్నలో తన ప్రేమికుఁడు వచ్చినట్లే యామె భ్రమించెను. ఆమె యులిక్కిపడి చూచెను, కాని అటకెవరు రాలేదే! ఆమె పొగడచెట్టుక్రింద కూర్చుండి యపుడే యొక గంట దాటిపోయెను. జీవితములో ఆమె అభిసరించుటకు సాహసించుటిదే మొదలు. భయముచే నామె మనము కంపించుచుండెను. కాని మఱలిపోవుట కామెకు మనసగుటలేదు. ఆమెకు ఉత్కంఠ, ప్రతీక్ష ఇత్యాది చెలికత్తెలుగా తోడై యుండిరి. వెన్కపాటున సవ్వడియైనది - 'ఇదిగో నేను వచ్చితిని' అని. నూరీ తిరిగిచూచెను - పొడగరి, ఎఱ్ఱని యువకుఁడు. వెన్నెలలో నాతనిని గుర్తించెను. 'షాహ్జాదా యాకూబ్ ఖాన్ గారా!' అను మాట లామె నోటినుండి వెల్వడెను.

'ఆఁ నేనే! చెప్పు నీ వెందుకు పిలిచితివో?'

నూరీని మౌనము చుట్టుముట్టెను. అతని ప్రశ్నలో ప్రేమ అక్షరమాత్రమయిన లేదు. మహలులలో నివసించెడి యామె పై ఎత్తువేసెను.

'మీ రక్కడ కెందుకు వచ్చితిరి?'

'నే నీ ప్రశ్నకు ప్రత్యుత్తర మీయక పోయినచో'?

నూరీకి జవాబు తోచలేదు. యాకూబు 'అప్పటినా రాకను తెలిసికొన గోరుచుంటివా?' అన్నాడు.

'చెప్పవద్దులెండి!'

'చెప్పినచో నాకు ...'

'మీరు భయపడుచున్నారు, చెప్పకండి.'

'సరే నీ దేయూరో నిజము చెప్పు?'

'కాశ్మీరు!'

యాకూబు నూరీ దగ్గఱకు చేరి కూర్చుండి, 'కాశ్మీరులో ఎక్కడ?'

'శ్రీనగరు దగ్గఱే మా యిల్లు.'

'ఇక్కడేమి చేయుచున్నావు?'

'నాట్యము చేయుదును. నా పేరు నూరీ.'

'కాశ్మీరు పోవలెనని నీకు లేదా?'

'లేదు.'

'ఎందుకని'?

'అక్కడకు వెళ్ళి యేమి చేయుదును? సుల్తాను యూసుఫ్ఖాను మాయిల్లు - వాకిలి అపహరించివేసినాఁడు, మాయమ్మ జైలులో కొనయూపిరితో నున్నదో, తుది యూపిరి వీడినదో!'

'నేను మీకు సుస్థితి గల్పించెదను. నీ విక్కడనుండి బయల్దేరు.'

'ఊహుఁ, నేనిక్కడనుండి కదలలేను. కాని నిన్న మీరక్కడ కెందుకువచ్చినారో గ్రహించాను.'

'అయితే మంచిదే. నూరీ! నేనుగూడా ఖైదీనే. ఇట అక్బరుచేతిలో చిక్కుకొని కొట్టుకొనుచున్నాను. రాత్రి నేను వచ్చినది వాని గుండెలో కత్తిగ్రుచ్చుటకు.'

'సమ్రాట్ అక్బరు హత్యకా!?' భయకంపితయైన నూరి ప్రశ్నించెను.

'అవును నూరీ! నీ వాసమయమున నటకు రాకున్నచో ఆపని ముగిసియుండెడిది. కాశ్మీరు

స్వాధీనము చేసికొన్న యాతని ...' యాకూబు ఆగి వెనుదిరిగి చూచెను, దూరాన ఎవరో వచ్చుచుండిరి. నూరీకూడ లేచి నిలువబడెను. ఇద్దఱు సరసువైపు క్రిందికి దిగిరి. నీటియొడ్డున కూర్చుండి నూరీ 'ఇఁక మీ రావిధముగా చేయకండి.' అన్నది.

'ఎందుకు చేయను! నాకు కాశ్మీరునుమించి ప్రియమయిన దేమున్నది? నేను దానికోసమేమయిన జేసెదను!' అని పల్కి యాకూబు నిట్టూర్పు విడచెను. అతని సుందరవదనము వేదనచే వివర్ణమాయెను. నూరీ చూచెను - అతఁ డామె ప్రేమమూర్తి. అతని హృదయమున ప్రేమవిహరణ బంధురవాంఛ ప్రబలముగా నున్నట్లు కానవచ్చెను, ఇటు ఏకాంత ప్రశాంత వసంత మాదక నిశీథము! ఆమె 'మీకు కాశ్మీరుపై ప్రేమ యుండవచ్చునుగాని మిమ్ములను ప్రేమించుచున్నవారును ఉన్నారు!' అని మెల్లగా ననెను.

'పిచ్చిదానా! నాయెదుట ఒకటే చిత్రమున్నది- సింధూజీలము తీరముల ఫలపుష్పవనములు. నేను వానిపైని ప్రేమను వదలి యుండలేక ...'

'ఊరకుండుఁడు. మెల్లగా మాట్లాడుటరాక పోయినచో గుట్టుగానుండుఁడు!' అట్లుపల్కి నూరీ యొకసారి వెనుదిరిగి చూచెను. ఆమెను నారీసహజ చాంచల్య మావహించుచుండెను. ప్రస్తుతఘడియలు తన యౌవన వసంతమును సఫలము చేయునట్లుండెను! అటు ఆ విప్లవయువకుఁడు సమ్రాటు అక్బరు ప్రాణములు తీయుటో లేక తన ప్రాణములు తీసికొనుటో నిశ్చయించుకొనియుండెను. పెద్దలు చెప్పుచుందురు - తాపసులను పతితులను జేయుటకు అప్సరసలు తయారగుదురని. ఇపుడు నూరీ అప్సరస యయ్యెను. ఆమె - 'అట్లయిన నన్ను కాశ్మీరు తీసికొని పొండి,' యాకూబు చెంతకు మఱికొంత జరిగి భయభీత నేత్రములతో, 'చెప్పండి, నన్ను తీసికొని పోయెదరా. నేనును ఈ స్వర్ణబంధనముల త్రెంచుకొనగోరుచున్నాను.'

'నీవు నన్ను ప్రేమించుచున్నావా నూరీ!'

'రెండులోకాలకంటెను మిన్నగా,' - నూరీ యున్మాదిని యగుచుండెను.

'కాని నేనిపుడింకొకసారి నీవు నిరోధించిన యాపనిని నిర్వర్తించెదను. తప్పించుకొన్న తిరిగి వచ్చెదను, లేదా...' అని పల్కి యాకూబు ఆమె చేతిని పట్టుకొనెను. నూరీకి ఆపాదమస్తకమేమొ యయిపోయెను. ఆమె తన మోహనవదనమును యాకూబు భుజముపై వాల్చి పల్కెను — 'వద్దు, ఇపుడాపని చేయవద్దు, నా మీద ఒట్టు!'

హఠాత్తుగా యువకుడు ఒక్క ఊపున లేచి నిలబడెను. నూరీ సద్దుకొనిచుండ యాకూబు అక్కడ లేడు. నూరీ రెండడుగులు వేసినదో లేదో మందము తాతారినిష్ఠురహస్తము ఆమెభుజాలపైబడెను - 'సుల్తానా నిన్ను చాల సేపునుండి వెదకుచున్నది?' అని వాడనెను.

3

సుల్తానా బేగము, అక్బరు పాదుషా చదరంగ మాడుచుండిరి. చదరంగములో ఎత్తులు వేయుటకు సమర్థులు సుందరీమణులే. నౌబత్ఖానానుండి యుదయ కాల మధురమయిన సన్నాయిస్వరము వినబడుచుండెను. నగారా అక్బరుకు ప్రీతియైన పద్ధతిలో వాయింపబడుచుండెను. దానిని ఆలకించుచు అక్బ రెత్తు వేయుట మఱచిపోయెను. అతనివైపుననున్న వారు దెబ్బలు తినిరి.

దెబ్బలు తిన్న దెవరోకాదు; నూరీయే. ఆ దెబ్బ లామెకు దుర్భరమయ్యెను. కొరడా చేతిలోనుంచుకొని అక్బ రామెవైపు పరికింపసాగెను. 'నేజచ్చిపోయితిని' - అని నూరీ బొబ్బలిడెను.

'నీవు చావవద్దు, బ్రతికి యుండు!' అని దక్షిణ నాయకునివలె నామెమనను రంజిల్లుటకు చతురుఁడయిన అక్బరు సుల్తానాదిక్కు చూచి 'దీనిపేరేమి? ఆరాత్రి దాగుడు మూతలాట సంఘటనము గుర్తుకు వచ్చుచున్నది.' అని ప్రస్తావించెను.

'దీనిది కాశ్మీరు. పేరు నూరీ. అద్భుతముగా నృత్యము చేయగలదు.' సుల్తానా ప్రత్యుత్తరించెను.

'నేనెపుడు చూడలేదే!'

'ఆలాగయితే చూడండి!'

'నూరీ! ఈ సన్నాయి స్వరమున కనుగుణంగా నృత్యము చేయగలవా?'

'ఎందుకు చేయలేను ప్రభూ!'

అక్కడివారు తమ తమ స్థానములలో యథాతథంగా కూర్చొనిరి. నూరీ మైమఱపించు నృత్యమారంభించెను. గజ్జలు ఘల్లుఘల్లున మ్రోగుచుండెను. జలతరంగములవలె నామె చెంగుచెంగున నర్తించుచుండెను. సరిగమపదని అని సప్త స్వరముల బలుకుచు అనేక భంగిమలలో అడుగులు వేయుచున్నపుడు, కాలి అందియల మ్రోగించుచున్నపుడు అక్బరు 'వాహ్! వాహ్!' అని సాధువాక్యములు పల్కుచుండెను. ఇట్లొక గంట నృత్యము సాగినది, సన్నాయి ఆగినది. అక్బరామెను పిలచి, 'నూరీ, నీకేమి కోరుకొందువు?'

'ఏమియు వద్దు ప్రభూ!'

'ఏమియు?'

కొంచెమాగి, 'మా అమ్మ నొకసారి చూడ గోర్కగా నున్నది; తను సెలవైనచో' నతమస్తకయై నూరీ పల్కెను.

'ఛీ ఇంకేమియు వద్దా?'

'ఇంకేమియు వద్దు.'

'సరే, నేను కాబూలు వెళ్లునపుడు వత్తువుగాని.'

మఱల ఆట ఆరంభమాయెను. సుల్తానా, పాదుషాలు ఎవరు ఓడెదరా యని తమలో తాము తలపోయుచుండిరి. 'నీవు నాతో ఆడు, కాని ఎప్పుడును నీవే యోడిపోవుచుండవలెను సుమా' - అన్నదే కదా యీ ప్రపంచపురీతి. నూరీ తిరిగి దెబ్బలు తిన్నది. 'నేను చచ్చితి'నని యామె కూయిడెను.

(సశేషము)

పాత్రుడుగారి

బాలసంజీవిని (Regd)

పిల్లల లివర్ అండ్ స్ప్లీన్ వ్యాధులను నివారించును

డాక్టరు పిల్లా పాపయ్య పాత్రుడు అండ్ బ్రదర్స్,

19, దక్షిణ మాడవీధి, మైలాపూరు, మదరాసు-4. Phone 71354

కుంభకోణము బ్రాంచి: 7. సారంగపాణి కోవిల తూర్పువీధి.

అన్ని మందుల షాపులలోను దొరకును.